

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

దేవపట్ల మిట్ట హోటల్ సమీపంలో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడింది. -8లో



యువకుడి ఆత్మహత్య

భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో పాటు రుణదాతల ఒత్తిడితో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 319 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	250	558
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 657.720 కిలోలు

న్యూస్‌రీల్

28న ఆలయం మూసివేత

రాయచోటిటౌన్: ఈ నెల 28వ తేది శనివారం చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ వీరభద్రస్వామి ఆలయం తలుపులు మూసివేయనున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం రాత్రి అశ్వనీ నక్షత్రం యుక్త రాహు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం ఉంటుందని తెలిపారు. శనివారం రాత్రి 6–30 గంటల నుంచి తెల్లవారు జామున 4–30 గంటల వరకు తలుపులు మూసివేస్తామని తెలిపారు. తెల్లవారి శుద్ధి చేసి సంప్రోక్షణ చేసిన తరువాత స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

27న తలనీలాల వేలం పాట

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజ స్వామి ఆలయంలో తలనీలాల సేకరణకు ఈ నెల 27న ఉదయం పది గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. కార్తీక మాసోత్సవంలో స్వామికి భక్తులు ఇచ్చే తలనీలాలు పోగు చేసేందుకు సిద్దవటం రంగనాయక స్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఏఎఫ్‌యూ పరీక్షలు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 3వసెమిస్టర్, 7వ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్‌లైడ్ ఆర్ట్, యానిమేషన్, ఆర్ట్ హిస్టరీ విభాగాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం తమిళనాడు రాష్ట్రం తిరుమన్నామలైకి ఈ నెల 27న జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఎనిమిది ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పాలి మేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప నుంచి రాత్రి 9గంటలకు, జమ్మలమడుగు నుంచి ఉదయం ఏడు గంటలకు, మైదుకూరు నుంచి ఉదయం 7గంటలకు, సాయంత్రం 6.00 గంటలకు, పోరుమామిళ్ల నుంచి ఉదయం 5.30, 6.00 గంటలకు, పులివెందుల నుంచి రాత్రి 8.00 గంటలకు, ప్రొద్దుటూరు నుంచి రాత్రి 9.00 గంటలకు, బద్వేలు నుంచి ఉదయం 6.00 గంటలకు సర్వీసులు నడుస్తాయన్నారు. బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు గిరి ప్రదక్షిణకు రానూ, పోనూ టిక్కెట్లను రిజర్వు చేసుకోవాలని కోరారు.

27నుంచి రాజంపేటలో జయంతి స్టాపింగ్

రాజంపేట : పూణె–కన్యాకుమారి జయంతి ఈనెల 27నుంచి రాజంపేట రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు రైల్వేబోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. రాజంపేట రైల్వేస్టేషన్‌లో కరోనా ముందు ఏవైతే హాల్టింగ్ ఉన్నాయో ఆ రైళ్లన్నింటికీ హాల్టింగ్ ఇవ్వాలని పలుమార్లు మినిస్టర్ ఆఫ్ రైల్వేస్, రైల్వేబోర్డు చైర్మన్‌లను కలిసి ఎంపీ మిథున్ రెడ్డి విన్నవించారు. ఇందులో జయంతి రైలు కూడా ఒకటి. రాజంపేట శబరిమలై వెళ్లడానికి జయంతి రైలు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ కృషిని కొనియాడుతున్నారు. నందలూరులో కూడా స్టాపింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.


27న జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు

కడప ఎడ్యుకేషన్: రాయచోటిలోని డైట్ కళాశాలలో ఈ నెల 27న జానపద నృత్యం, రోల్ ప్లే (పాత్ర పోషణ) పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ జిల్లా డీఈఓ, రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8, 9వ తరగతులకు జానపద నృత్యం, తొమ్మిదో తరగతి విద్యార్థులకు రోల్ ప్లే పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో(ప్రభుత్వ, జెడ్పీ, ఆదర్శ, ఎయిడెడ్, గురుకుల, కేజీబీవీ)చదివే విద్యార్థులంతా పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పాల్గొనదలచిన విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ పంపాలన్నారు. ఒక పోటీలో పాల్గొన్న వారు ఇంకో పోటీకి అనర్హులని తెలిపారు. రోల్ ప్లేకు నలుగురు లేక ఐదుగురు, జానపద నృత్యాలకు ఆరుగురు విద్యార్థులు ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు రాయచోటి డైట్ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు. వరుస ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు అజయ్‌కుమార్‌బాబు (9347541312), శ్రీదేవి (9441228359), అసదుల్లా (9440084715)లను సంప్రదించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

మార్కెట్‌పై మదనపల్లె పట్టు

మల్బరీ సాగు రైతులు మార్కెట్‌పై 'పట్టు' బిగించారు. తక్కువ సమయంలో దిగుబడితో పాటు నాణ్యమైన పట్టు ఇవ్వడంలో మదనపల్లె రైతులు పేరు గడించారు. దీనికి తోడు ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది.

- మల్బరీ సాగులో అన్నమయ్య జిల్లా మూడో స్థానం
- నాణ్యమైన పట్టుగూళ్లకు పేరుగాంచిన మదనపల్లె మార్కెట్
- ఆశాజనకంగా పట్టుగూళ్ల ధరలు



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు

మదనపల్లె సిటీ: 'పట్టు' ధరలు...రైతుల ఇంట సిరులు కురుస్తున్నాయి. జిల్లాలోని మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్ రాష్ట్రంలోనే పేరుగాంచింది. ప్రస్తుతం పట్టుగూళ్లు కిలో కనిష్ఠం రూ.400 నుంచి రూ.500 వరకు ధర పలుకుతున్నాయి.జిల్లాలో ఉత్పత్తయ్యే పట్టు అత్యంత నాణ్యమైనది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే పట్టుకు దేశీయంగా మంచి మార్కెట్ ఉంది. పట్టుచీరలకు మదనపల్లె పట్టణం నీరుగట్టువారి పల్లె ఖ్యాతి గాంచింది. మన రాష్ట్ర రైతులతో పాటు కర్ణాటక ప్రాంత రైతులు ఇక్కడికే పంట తీసుకొస్తున్నారు.

ఏడాదికి ఐదారు పంటలు: జిల్లాలో 12,839 ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. రాష్ట్రంలో మొదటి స్థానం సత్యసాయి జిల్లా కాగా మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచింది. అత్యధికంగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో సాగు చేస్తున్నారు. ఇక్కడి పట్టుగూళ్లు చాలా తక్కువ సమయంలోనే చేతికొస్తాయి. రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేసుకుంటే ఏడాదిలో ఐదారు పంటలు తీసుకోవచ్చు.

మదనపల్లె మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

తేది	కనిష్టం	గరిష్టం
24–10–23	రూ.505	రూ.505
23–10–23	రూ.506	రూ.540
22–10–23	రూ.395	రూ.395
21–10–23	రూ.505	రూ.505
20–10–23	రూ.405	రూ.450
19–10–23	రూ.485	రూ.485


మల్బరీతోట

పట్టుగూళ్ల ధర ఆశాజనకం



మూడు ఎకరాల్లో మల్బరీ సాగు చేశాం. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం. బైవోల్టిన్ పట్టుగూళ్లు పెంచాం. దిగుబడి బాగా వచ్చింది. పట్టుగూళ్ల ధర కూడా ఆశాజనకంగా ఉంది. కిలో రూ.500కుపైగా పలికింది.
–ఎం.బాలకృష్ణారెడ్డి, రైతు, అరికెల, రామసముద్రంమండలం

అవగాహనతో అధిక లాభాలు



మల్బరీ సాగుకు ప్రభుత్వం పెట్టుబడి,సబ్సిడీ పెంచింది. గతంలో మల్బరీ యూనిట్ నెలకొల్పడానికి రూ.14 వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ మొత్తానికి రూ. 25 వేలకు పెంచారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీ ఉంటుంది. మల్బరీ విస్తీర్ణం పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. మండలాల్లోని సచివాలయ పరిధిలో మల్బరీ సాగు పెంపుకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సాహకాలు గురించి తెలియజేస్తున్నాం. ఇప్పటికే మల్బరీ సాగు చేస్తున్నారు. దీన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తాం.
–రామమోహన్, ఏడీ, పట్టు పరిశ్రమలశాఖ, మదనపల్లె

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సమీక్ష

- కలెక్టర్ గిరీషా పీఎస్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ, జీజీహెచ్ తదితర వాటికి వైద్యులు చేసిన రెఫరల్స్ మీద దృష్టి సారించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో మెడికల్ ఆఫీసర్స్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు తదితర అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2941 పేషెంట్లను జీజీహెచ్ తదితర వాటికి రెఫరల్స్ పంపినట్టు తెలుస్తోందని, వారందరినీ ఏఎన్ఎంలకు మ్యాప్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మంచి వైద్యులు ఉంటే రెఫరల్స్ అవసరం లేదన్నారు. జిల్లాలో చాలా మంది ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని, అయితే వాటిలో లాగిన్ అవ్వలేదన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న వారందరూ లాగిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను, మండల స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కొండయ్య, మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, మండల స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నాటికి ఇంటింటికి కుళాయి కనెక్షన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకం అమలులో భాగంగా డిసెంబర్ 15వ తేది నాటికి జిల్లాలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జల జీవన్ మిషన్ పథకం అమలుపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పథకం అమలులో భాగంగా టెండర్ల దశ అనంతరం సాధించిన ప్రగతి అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ పివి ప్రసన్న కుమార్, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ ముఖ్యం

జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గుర్రంకొండ: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని జాయింట్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలాల్లోని సమస్యలను పరిష్కరించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే సమస్య తీవ్రతను బట్టి అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. సరిమడుగు గ్రామంలో రీసర్వే సక్రమంగా నిర్వహించ లేదంటూ డీటీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే జనం ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ కార్యాలయాన్ని కొత్త నిర్మించిన సచివాలయం భవనంలోకి మార్చాలని జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్ జేసీకి వినతిపత్రం సమర్పించారు. తరిగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పనితీరు సక్రమంగా లేదని డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని గ్రామస్తులు జేసీకి ఫిర్యాదు చేశారు. గుర్రంకొండలో అంగన్‌వాడీకేంద్రం నిర్మాణపనులు కావాలనే కొంత మంది అడ్డుకొంటుండడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలన జేసీ పీడీ ధనలక్ష్మిని ఆదేశించారు. పీడీ ధనలక్ష్మి, జిల్లా సర్వేయర్ జయరాజ్, ఆర్డీవో రంగస్వామి, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో వెంకటేశులు, జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మెన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, సర్పంచ్‌లు ,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్ద దర్గా ఉరుసు.. అందరి పండుగ

డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం కడప పెద్ద దర్గా ఉరుసును నిర్వహిస్తోందని, అందరి పండుగగా భావించి ప్రజలు విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్ బాషా పిలుపునిచ్చారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ అధ్యక్షతన స్థానిక అమీన్ పీర్(పెద్ద)దర్గాలోని ముషాయిరా హాల్‌లో దర్గా ఉరుసు ఉత్సవాల నిర్వహణకు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నగర ప్రముఖులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉత్సవాలకు దక్షిణ భారతదేశం నలమూలల నుంచి భక్తులు వస్తారన్నారు. రోడ్లు, సర్కిళ్ల విస్తరణ పనులతో ఇబ్బంది కలగకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే దర్గా ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత పోలీసు, నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖలపై ఉందన్నారు. నెలరోజుల ముందే ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఎస్పీ సిద్దార్థ కౌశల్ మాట్లాడుతూ ప్రత్యేకంగా అధ్యయనం చేసి విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. నిర్వాహకులు ప్రస్తావించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ రోడ్ల విస్తరణతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైతే బారికేడ్లు ఏర్పాటు చేస్తామని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం దర్గా ప్రతినిధులతో కలిసి ఉత్సవాల కార్యక్రమాలతో కూడిన పోస్టర్లను ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్, తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, శిక్షణ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, నగర కార్పొరేటర్లు, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు హాజరయ్యారు.

ఉరుసు ఉత్సవాల వివరాలు

- నవంబరు 13న నషాన్ కార్యక్రమం నిర్వహిస్తారు.
- 25 నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం
- 26న గంధం, 27న ఉరుసు, 28న తహలీల్ ఫాతెహా, ముషాయిరా నిర్వహిస్తారు.
- 29న ప్రముఖ గాయకులచే ఖవ్వాలీ కచేరీ ఉంటుంది.
- 30న పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ గండి వాటర్‌వర్క్స్ వద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తారు. ఆ రాత్రి తెల్లవారుజాము వరకు ఊరేగింపు ఉంటుంది.
- డిసెంబరు 1న పీఠాధిపతి అనుమతితో ఉరుసు ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పోలీసు ప్రతిష్ట పెంచుతాం!

- విశాఖ, భువనేశ్వర్‌లో చదువు పూర్తి
- 2014 ఐపీఎస్‌కు సెలెక్ట్ అయి అనేకచోట్ల పనిచేశా
- ఎర్రచందనం అక్రమ రవాణాకు అన్ని చర్యలు చేపడుతున్నాం
- ప్రమాదాలు నివారించడం... సైబర్ నేరాలు అడ్డుకోవడమే లక్ష్యం
- 'సాక్షి'తో ఎస్పీ బొడ్డెపల్లి కృష్ణారావు


బొడ్డెపల్లి కృష్ణారావు , ఎస్పీ

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి రాయచోటి: పోలీసు అంటేనే ప్రజల్లో నమ్మకం, విశ్వాసం ఉండేలా పని చేస్తాం.. అలసత్వం లేకుండా సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటాం..' ఇదీ ఎస్పీ బొడ్డెపల్లి కృష్ణారావు మాటలు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామని అంటున్నారు. తన విద్యాభ్యాసం..ఉద్యోగం తదితర విషయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

విశాఖ, భువనేశ్వర్‌లలో చదువుకున్నా!

మాది శ్రీకాకుళం. విశాఖపట్టణం, భువనేశ్వర్‌లలో చదువు పూర్తి చేశా. ఒకటో తరగతి నుంచి పెద్దపెద్ద చదువుల వరకు అంతా అక్కడే సాగింది. నాన్న రైల్వే ఉద్యోగి. సివిల్ సర్వీసెస్‌కు వెళ్లాలని కష్టపడి చదివాను. 2014లో ఐపీఎస్‌కు సెలక్ట్ అయ్యాను. తొలుత వైజాగ్ గ్రే హౌండ్స్‌లో, ఆ తర్వాత పులివెందుల ఏఎస్పీగా పనిచేశాను. తర్వాత పదోన్నతిపై నర్సీపట్నం ఓఎస్‌డీగా, మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసినంతరం వైజాగ్ రూరల్ ఎస్పీగా విధులు నిర్వర్తించాను. అక్కడి నుంచి ఏసీబీకి వెళ్లి, అక్కడ పనిచేసిన అనంతరం అన్నమయ్య జిల్లా ఎస్పీగా వచ్చాను. నా సతీమణి వైద్యురాలు. మాకు ఇద్దరు పిల్లలు.

ఇక్కడ పనిచేశా...అవగాహన ఉంది

అన్నమయ్య జిల్లా ఏర్పాటు కాకముందు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పులివెందుల ఏఎస్పీగా పనిచేశాను. అప్పుడు రాయచోటి కూడా పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో వచ్చేది కాబట్టి పూర్తి అవగాహన ఉంది. జిల్లాలో శాంతిభద్రతల పరంగా ఎలాంటి సమస్య లేదు. జిల్లాలో ప్రశాంతయుత వాతావరణం కనిపించేలా పోలీసుశాఖ పనిచేస్తోంది.

ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

జిల్లాలోని అడవుల్లో ఎర్రచందనం విస్తారంగా ఉంది. దీన్ని అక్రమంగా సొమ్ము చేసుకోవాలని స్మగ్లర్లతోపాటు తమిళ కూలీలు, స్థానికులు అక్రమ రవాణాకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా అనేకచోట్ల సుమారు 22 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీతోపాటు నైట్ వాచ్ (గస్తీ) పెడుతున్నాం. కూంబింగ్ ఆపరేషన్లు కూడా ముమ్మరం చేశాం . చెక్‌పోస్టుల వద్ద గతంలో పనిచేసిన వారిని కాకుండా కొత్త వారిని తీసుకువచ్చి పటిష్ఠ వ్యూహం అమలు చేస్తున్నాం.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవు. లిక్కర్, గుట్కా, పేకాట క్రికెట్ బెట్టింగ్ ఇలా ఎలాంటి అసాంఘిక వ్యవహారమైనా చర్యలు కఠినంగా ఉంటాయి. అక్రమ మద్యంపై దాడులు కొనసాగిస్తున్నాం. హత్యలు, ఇతర అసాంఘిక వ్యవహారాల జోలికి వెళ్లి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ఎక్కడా ఎలాంటి సమాచారమున్నా నేరుగా ప్రజలు ఆయా పోలీసుస్టేషన్‌లోగానీ, డయల్ 100కు ఫోన్ చేయవచ్చు.

ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి

జిల్లాలో ప్రధానంగా మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పూర్తిగా అడ్డుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అదేపనిగా ప్రమాదాలు జరుగుతున్న తీరుపై ఆలోచన చేశాం. హెల్మెట్ లేకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర అంశాలను గుర్తించాం. ఎక్కడికక్కడ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద స్పీడ్ బ్రేకర్లతోపాటు...మలుపుల్లో వాహనాలు కనిపించేలా పెద్ద పెద్ద అద్దాలు ఏర్పాటు, వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇక సైబర్ నేరాలపై దృష్టి సారించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. చోరులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తకొత్త మోసాలకు తెరలేపుతున్న తరుణంలో సెల్‌ఫోన్లకు వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లోని మహిళా పోలీసుల ద్వారా అందరికీ తెలియజేస్తున్నాం. అలాగే గంజాయిగానీ, డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నిరోధానికి చర్యలు చేపడుతున్నాం. గతంలో కేసులున్న వారిపై కూడా నిఘా పెట్టాం.

అక్రమ మద్యం, నాటుసారా నిర్మూలనకు చర్యలు

రాయచోటి: జిల్లాలో అక్రమ మద్యం నాటుసారా నిర్మూలనకు సమన్వయంగా చర్యలు చేపట్టి అక్రమ మద్యం లేకుండా చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో గవర్నమెంట్ రిటైల్, ఔట్‌లెట్ షాపులు ... బార్లు ఉన్నాయి.. వాటి ద్వారా వస్తున్న రెవెన్యూ తదితర విషయాలపై అధికారులనుఅడిగి తెలుసుకున్నారు. 2022 సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికం ఏప్రిల్ నుంచి జూన్ వరకు 3.6 శాతం, రెండవ త్రైమాసికం జులై నుంచి సెప్టెంబర్ వరకు 1.24 శాతం అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ డీపీఈఓ షేక్ ఆయేషాబేగం కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కరు, నాటుసారా నిర్మూలన కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అక్రమ మద్యం, నాటుసారా నిర్మూలనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న వారిని గుర్తించి ఈ ఏడాది ఇప్పటివరకు 106 కేసులు నమోదు చేయగా 195 మందిని అరెస్ట్ చేశామని, అలాగే తనిఖీలు చేసి అక్రమ మద్యం కేసులలో 60 కేసులు రిజిస్టర్ చేయగా 19 మందిని బైండోవర్లు చేశామన్నారు. 68 మందిని అరెస్ట్ చేసినట్లుగా కలెక్టర్‌గా వివరించారు. ఎస్ఈబీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాసులు, ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లు చంద్రహాస్, మనోహర్, వాసుదేవచౌదరి, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ నాగమనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం పెద్ద కురప్పల్లె పంచాయతీ మట్లవారిపల్లెకు చెందిన నారాయణప్ప కుమారుడు ఎం .మంజునాథ(35) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం వ్యక్తిగత పనులపై రామసముద్రం వచ్చి ద్విచక్రవాహనంలో తిరిగి వెళుతుండగా, వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆటోలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే బి.కొత్తకోట పట్టణం బీసెట్టి కాలనీకి చెందిన శ్రీరాములు కుమారుడు ఎం.కిరణ్‌కుమార్(29) ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం పట్టణంలో తమ నివాసానికి సమీపంలో నడిచి వెళుతుండగా, ఎదురుగా ద్విచక్రవాహనంలో వచ్చిన వ్యక్తి కిరణ్‌కుమార్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా, స్థానికులు బి.కొత్తకోట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.


లారీ, బొలేరో వాహనం ఢీ

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మోటకట్ల బస్టాప్ వద్ద బుధవారం సిమెంట్ లారీ, బొలేరో వాహనం ఢీ కొన్నాయి. పోలీసుల వివరాల మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నాగప్ప, దిలీప్ కుమార్‌లు బొలేరో వాహనంలో పీలేరు వైపు వెళ్తుండగా పీలేరు వైపు నుంచి సిమెంట్ లారీ వస్తోంది. రెండు వాహనాలు మోటకట్ల బస్టాప్ వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నాగప్ప, దిలీప్ కుమార్‌లకు తీవ్ర గాయాలు కాగా, లారీ డ్రైవర్ బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

- టెంట్ ఎల్లో చామంతి పూల సాగుపై రైతుల ఆసక్తి
- కొత్తగా సాగు చేస్తున్న రైతులు
- మార్కెట్లో కిలో బంతి రూ.100 నుంచి రూ.120
- ఆశించిన ఆదాయంతో రైతుల్లో ఆనందం

విరులు.. సిరులు.!





గుర్రంకొండ మండలం కొత్తపల్లె రైతులు సాగు చేసిన టెంట్ ఎల్లో రకం పూల తోటలు (ఇన్‌సెట్) కోత కోసి రవాణాకు సిద్ధం చేసిన టెంట్‌ఎల్లో రకంపూలు

గుర్రంకొండ : టెంట్‌ఎల్లో చామంతి(నాటి చామంతి) పూల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది నుంచి ఇక్కడి రైతులు కొత్తగా ఈ రకం పూలసాగును చేపట్టారు. ఈ రకం పూల సాగుతో రైతుకు నిలకడైన ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధర రూ. 100 నుంచి రూ.120 వరకు ధరలు పలుకుతున్నాయి. గత ఏడాది దసరా, దీపావళి పండుగల సమయాల్లో కిలో పూల ధర రూ. 100 నుంచి రూ.200 వరకు పలికింది. దీంతో ఈ కొత్తరకం పూలసాగుతో రైతులు లాభాల బాట పడుతున్నారు.

ఎకరానికి రూ.1.50 ఖర్చు

టెంట్ ఎల్లో పూలసాగు దుక్కుల దగ్గర నుంచి పూలు చేతికొచ్చేంత వరకు రూ.1.50 వరకు ఖర్చు వస్తుంది. ఎకరానికి 8వేలు నుంచి 10 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఒక నారు మొక్క మార్కెట్లో రూ. 3 వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఎకరానికి రూ. 30 వేలు నారు మొక్కలకు ఖర్చు వస్తుంది. ఎరువులు, పురుగుల మందుల పిచికారి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టమాటా తోటల మాదిరిగా ఈ మొక్కలకు సీడ్ కట్టెలు నాటే ప్రక్రియను రైతులు చేపట్టారు. తద్వారా తోటలు వర్షాలకు దెబ్బతినకుండా ఏపుగా పెరుగుతుంటాయి. పూల మొక్కలు నాటిన 120 నుంచి 150 రోజుల మధ్యలో పూల దిగుబడి మొదలవుతుంది.

కర్ణాటక నుంచి దిగుమతి

ప్రస్తుతం ఈ రకం పూల నారు మన రాష్ట్రంలోని నర్సరీల్లో లభించడం లేదు. దీంతో మన జిల్లా రైతులు కర్ణాటక రాష్ట్రం నుంచి ఈ పూల నారుమొక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. సాధారణంగా ఇక్కడి నర్సరీల్లో రూ. 1 నుంచి రూ. 2 వరకు నారు మొక్కల ధరలు ఉంటాయి. ప్రస్తుతం వీటికి ఎక్కువగా డిమాండ్ ఉండడంతో రైతులు బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొంటుండడం గమనార్హం.

సాధారణ చామంతితో పోల్చితే బరువు ఎక్కువ

సాధారణ చామంతి పూలతో పోల్చితే ఈ రకం పూలు బరువు ఎక్కువ. సాధారణ చామంతి పూల రేకుల్లా కాకుండా టెంట్ ఎల్లో చామంతి రేకుల బరువు వైవిధ్యంగా ఉంటుంది. తొందరగా రేకులు రాలిపోవు, రబ్బరు లాగా పువ్వుకే అతుక్కొని ఉంటాయి. వీటికి సాధారణ చామంతి పూల కంటే ఎక్కువ రోజులు వాడిపోకుండా ఉండగల స్వభావం ఉంది. అందుకనే మార్కెట్లో ఈ రకం పూలకు ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం పసుపురంగు ఉన్న పూలతో పాటు ఇప్పుడిప్పుడే తెలుపు రంగు రకం పూల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తుండడం విశేషం.

ఎకరానికి 4నుంచి 5 టన్నుల దిగుబడి

టెంట్‌ఎల్లో పూల సాగులో 4 నుంచి 5టన్నుల పూల దిగుబడి వస్తుంది. ఇంకా మంచి ఎరువులు వేసి సకాలంలో తోటలను కాపాడుకుంటే మరో టన్ను వరకు అధిక దిగుబడి రావచ్చు. సాధారణంగా 120 నుంచి 150 రోజుల నుంచి పూల దిగుబడి ప్రారంభమైన మరో 90 రోజుల పాటు పూల కోతలు వస్తుంటాయి. ఈ లెక్కన పంట మొత్తం కాలం 7 నెలల పాటు ఉంటుంది.

మార్కెట్లో కిలో రూ. 100 నుంచి రూ.120

ప్రస్తుతం ఈ రకం పూలు మార్కెట్లో కిలో రూ.100 నుంచి రూ.120 వరకు ధరలు పలుకుతున్నాయి. ఇవే ధరలు మార్కెట్లో నిలకడగా ఉంటే రైతులు మంచి లాభాలు చూసే అవకాశముంది. ఈ లెక్కన ఎకరానికి రూ.4 లక్షల నుంచి రూ.5.20 లక్షల ఆదాయం వస్తుంది. పంటసాగు ఖర్చు, కోత కూలీలు, రవాణా ఖర్చులు పోను ఎకరానికి రూ. 2.50 లక్షల నుంచి రూ. 3.70 లక్షల వరకు లాభాలు చవిచూసే అవకాశముంది. మార్కెట్లో ధరల నిలకడను బట్టి ఆదాయ, లాభాలు మారవచ్చు. నిలకడైన ఆదాయం వచ్చే ఇలాంటి కొత్తరకం పూల సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపిస్తున్నారు.

పండుగ సీజన్‌లో కిలో రూ.100 నుంచి రూ.200

టెంట్ ఎల్లో రకం చామంతి పూలకు పండుగ సీజన్‌లలో మంచి ధరలు లభిస్తాయి. గత దసరా, దీపావళి పండుగ సీజన్‌లో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కిలో రూ. 100 నుంచి రూ.200 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం పడమటి ప్రాంతాల రైతులు ఈ రకం పూల సాగు ఎక్కువగా చేపట్టారు. ప్రస్తుతం దసరా, ఆ తరువాత కార్తీక మాసం కావడంతో పాటు రానున్న జనవరిలో సంక్రాంతి పండుగల సీజన్‌లో మంచి ధరలు పలికే అవకాశముంది.

ఎకరంలో సాగు చేశా



టెంట్‌ఎల్లో రకం పూలను ఎకరం పొలంలో సాగు చేశాను. నారు మొక్కలు నాటిన నుంచి పూల కోతలు మొదలయ్యే వరకు ఎకరానికి రూ. లక్ష వరకు ఖర్చు వచ్చింది. సాధారణ చామంతి పూలతో పోల్చితే ఈ రకం పూలలో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. మార్కెట్లో కూడా వీటికి మంచి డిమాండ్ ఉంది. – రమణ, పూలరైతు, గంగిరెడ్డిగారిపల్లె

నిలకడైన ఆదాయం



ఈ రకం పూలసాగుతో రైతుకు నిలకడైన ఆదాయం వస్తుంది. మార్కెట్లో పూల ధరలు కొద్ది రోజులపాటు నిలకడగా ఉంటే నష్టాలు రావు. పూలు కూడా మార్కెట్‌కు తీసుకెళ్లేంత వరకు దెబ్బతినకుండా ఉంటాయి. సాధారణ చామంతితో పోల్చితే ఈ రకం పూలు తొందరగా పాడవవు. ఎకరానికి ఎంత లేదన్నా రూ. 4 లక్షల ఆదాయం వస్తుంది. – రెడ్డిమోహన్, పూల రైతు, చెరువుమొరవపల్లె

ఆగిన టిప్పర్‌ను ఢీకొని ఇరువురు యువకుల దుర్మరణం



సంఘటన స్థలంలో మృతి చెందిన ఇద్దరు యువకులు మస్తాన్ రెడ్డి, అల్తాఫ్



మస్తాన్ రెడ్డి (ఫైల్)



అల్తాఫ్ (ఫైల్)

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని కొర్రపాడు-గోపవరం గ్రామాల మధ్యలో ఆగి ఉన్న మట్టి టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇరువురు యువకులు దుర్మరణం చెందారు. పోలీసుల తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం గ్రామానికి చెందిన నంద్యాల మస్తాన్ రెడ్డి (19), బంగ్లా అల్తాఫ్ (18) అనే ఇద్దరు యువకులు బుధవారం సాయంత్రం తమ సొంత పని మీద ప్రొద్దుటూరు పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళుతున్నారు. ఈ క్రమంలో ఆగి ఉన్న మట్టి టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఆ యువకులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ రమణారెడ్డి, రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదం జరిగిన తీరును వారు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. మస్తాన్ రెడ్డి తల్లిదండ్రులకు ఒకే ఒక్క కుమారుడు కావడంతో వారి వేదన వర్ణనాతీతం. బంగ్లా అల్తాఫ్ తండ్రి అబ్దుల్, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఇరువురు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో రాజుపాళెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

7 గ్రాముల బంగారు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

పుల్లంపేట : పుల్లంపేట ఎస్ఐ రఘురాం బుధవారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఏడు గ్రాముల బంగారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పుల్లంపేట నుంచి ఏపీ39యు 8905 నంబరు గల పల్సర్ బైక్‌లో రైల్వేకోడూరులోని కృష్ణానగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అతి వేగంతో మోటారు బైక్ నిలపకుండా వెళ్లారు. దీంతో ఎస్ఐ రఘురాంకు అనుమానం రావడంతో వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న 7 గ్రాముల బంగారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ సుబ్బరాయుడు, నరసింహులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆయిల్ ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన ఆయిల్ ట్యాంకర్



గాయపడిన నాగరాజు, సుభాన్

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల మిట్ట హోటల్ సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్లు నాగరాజు, సుభాన్‌లకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు ఆయిల్ ట్యాంకర్ చిత్తూరు నుంచి కడప అలంఖాన్‌పల్లిలోని లక్ష్మీగణపతి ఫిల్లింగ్ స్టేషన్‌కు డీజిల్, పెట్రోల్ తరలిస్తోంది. దేవపట్ల మిట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారును ఢీకొని అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కడప అలంఖాన్‌పల్లెకు చెందిన నాగరాజు, కడప టౌన్‌కు చెందిన సుభాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి రూరల్ సీఐ తులసీరామ్, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్పర్థలతో యువకుడి ఆత్మహత్య



మదనపల్లె : భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలు, మద్యానికి బానిస కావడం, రుణదాతల ఒత్తిడితో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కలికిరి మండలం ఆసాదివారిపల్లెకు చెందిన రెడ్డెయ్య రెండో కుమారుడు ఏ.రాజేష్(25) అదే ప్రాంతానికి చెందిన వైష్ణవి(18)ని ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. రాజేష్ వృత్తిరీత్యా కార్పెంటర్ కాగా, మూడు నెలల క్రితం భార్యాభర్తలు ఇద్దరూ మదనపల్లె మండలం బసినికొండలో అద్దె ఇంటిలో కాపురానికి వచ్చారు. ఈ క్రమంలో ఇటీవల రాజేష్‌కు భార్యపై అనుమానం పెరిగింది. పైగా ఇంటి అవసరాల కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. అంతేకాకుండా మద్యానికి బానిస కావడంతో తరచూ భార్యతో గొడవపడేవాడు. ఇద్దరిమధ్య మనస్పర్థలు తగ్గించుకునేందుకు భార్య ఎంతచెప్పినా వినిపించుకునేవాడు కాదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవపడ్డాడు. అనంతరం మనస్తాపం చెంది ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. ఇది గమనించిన భార్య తలుపు తీయమని ఎంత ప్రాధేయపడినా తీయలేదు. దీంతో ఆమె గట్టిగా అరుస్తూ.. కిటికీలో నుంచి లోపలకు చూడగా, బాత్‌రూమ్‌లోని చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి అతడిని కిందకు దించి 108కు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న 108 టెక్నీషియన్స్ పరీక్షించి రాజేష్ అప్పటికే మృతి చెందాడన్నారు. దీంతో స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య వైష్ణవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

టిన్నర్ పోసుకొని మహిళ...



ఆస్పత్రిలో ఖదీరున్నీసా (మృతి చెందక ముందు)

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణంలో దుగ్గనపల్లె ఖదీరున్నీసా (40) అనే మహిళ ఒంటిపై టిన్నర్ పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. అర్బన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా దుగ్గనపల్లె పీరూసాహెబ్, అతని భార్య నివాసముంటున్నారు. మంగళవారం రాత్రి ఇంటిలో భర్త లేని సమయం చూసి ఒంటిపై టిన్నర్ పోసుకొని నిప్పు పెట్టుకొంది. ఇరుగుపొరుగు వారు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శరీరం 70 శాతానికిపైగా కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోస్టు మార్టం కోసం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కడుపునొప్పి తాళలేక..



ఆత్మహత్య చేసుకున్న పగిడిండ్ల భాగ్యమ్మ

రామాపురం : మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన పగిడిండ్ల భాగ్యమ్మ(38) అనే మహిళ కడుపునొప్పి తాళలేక బుధవారం రాత్రి ఇంటి పైకప్పునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మూడేళ్ల క్రితం భాగ్యమ్మ భర్త మృతి చెందాడు. ఆమెకు కుమారుడు రెడ్డిశేఖర్ స్థానికంగా గల ఒక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈమె అనారోగ్యంతో బాధపడుతూ కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కడుపునొప్పి ఎక్కువ కావడంతో తన కుమారుని మందులు తీసుకొని రమ్మని పంపించి ఇంట్లోనే ఉరి వేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సత్తాచాటిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు

రాచర్ల : ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ పెద్దబండ ఎద్ల బండలాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలుగారిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్లు 2022 అడుగులు లాగి రెండో బహుమతి పొందాయి.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

రూ.2లక్షలకు పైగా ఆస్తి నష్టం



మంటలు చెలరేగుతున్న దృశ్యం

రైల్వేకోడూరు : కోడూరు పట్టణంలోని లూథరన్ చర్చి ఆవరణంలో బుధవారం రాత్రి సిలిండర్ పేలి రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంటిలో ఉన్న వారు ప్రమాదాన్ని గ్రహించి వెంటనే పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చర్చి కాంపౌండ్‌లో ఉన్న ఇంటి యజమాని విక్టర్ తన భార్య లెనిన్ గ్యాస్ స్టౌ వెలిగించారు. అప్పటికే గ్యాస్ పైప్ నుంచి గ్యాస్ లీక్ అయ్యే విషయం గమనించకపోవడంతో సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న వారందరూ బయటకు పరుగులు పెట్టడంతో అప్పటికే ఇంట్లో మంటలు వ్యాప్తి చెంది, గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలి ఇంటిపై కప్పు రేకుల నుంచి బయటకు వచ్చి పడింది. పెద్ద శబ్దం రావడంతో చర్చి ఆవరణలో ఉన్నవారంతా కేకలు వేస్తూ పరుగులు పెట్టారు. ఇంట్లో కాలుతున్న వస్తువులను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి అప్పటికే కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. జరిగిన నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపినందుకు జైలు, జరిమానా

రాయచోటిటౌన్ : మద్యం తాగి వాహనాలు నడిపినందుకు ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తూ రాయచోటి ఏజెఎఫ్‌సీఎం డాక్టర్ ఎస్ఎంటీకే శారద తీర్పు చెప్పారు. బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తన సిబ్బందితో కలసి రాయచోటి పట్టణంలో వివిధ కూడళ్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. వీరిని విచారించిన న్యాయమూర్తి నిందితులకు ఒక్కొక్కరికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10,500లు జరిమానా విధించారని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

భర్త ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

భార్య, మరో ఇద్దరిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : వివాహేతర సంబంధం భర్త ప్రాణాలను తీసింది. రాజుపాళెం మండలం అరకటవేముల గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి(33)కి కడపకు చెందిన ప్రేమలలితతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె సచివాలయంలో జీఎంఎస్‌కే ఉద్యోగం రావడంతో భార్యాభర్తలు అక్కడే నివాసం ఉంటున్నారు. ప్రేమలలిత ఏడాది నుంచి అదే ప్రాంతానికి చెందిన పబ్బతి శ్రీను అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు మందలించినా ఆమెలో మార్పు రాలేదు. ఈ క్రమంలో దసరా సందర్భంగా ఈనెల 23న రాత్రి దంపతులిద్దరూ శివాలయం వద్దకు వెళ్లారు. భార్య పక్క న పబ్బతి శ్రీను ఉండటాన్ని చూసిన శివశంకర్‌రెడ్డి అతన్ని వెంబడించాడు. అతన్ని పట్టుకొని సెల్‌ఫోన్ లాక్కున్నాడు. తర్వాత భార్య ప్రేమలలిత, పబ్బతి శ్రీను, తీట్ల రాజా అనే వ్యక్తులు అతనికి ఫోన్ చేసి సెల్‌ఫోన్ ఇవ్వకుంటే చంపుతామని బెదిరించారు. దీంతో భయపడిన అతను మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.